నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, బుధవారం 7 మే 2025 | NAGARKURNOOL

కార్యకర్తలకు అండగా ఉంటాం

పార్టీ బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాలపేట, మే 6 : కార్యకర్తలకు అండగా ఉంటూ కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాడిపర్తికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అడ్డాకుల రవీందర్ కొంతకాలం కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో ఇన్సూరెన్స్ చెక్కును మంగళవారం నిరంజన్‌రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవీందర్ భార్య అంజలికి రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేసి ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రైతు బీమా కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పెబ్బేరు మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్, రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు తిరుపతియాదవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు మన్యంనాయక్, సునీల్, శంకరయ్య, కృష్ణయ్య, మోహన్, రాములు, వెంకటేశ్, రమేశ్, రాము, శివ, లక్ష్మణ్, నాగరాజుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్ సీతాఫలానికి ప్రపంచ ఖ్యాతి



కొత్తపల్లి శివారులో సీతాఫలాల మొక్కలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సైదయ్య బృందం

- భౌగోళిక గుర్తింపునకు కృషి
- ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిడిగం సైదయ్య

నవాబ్‌పేట, మే 6 : ప్రపంచ ఖ్యాతిగాంచిన బాలానగర్ సీతాఫలానికి భౌగోళిక గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిడిగం సైదయ్య తెలిపారు. నవాబ్‌పేట మండలంలోని పోమాల, కొల్లూరు, కేశవరాపల్లి, కొత్తపల్లి, కల్మన్‌కల్వ గ్రామాల్లో మంగళవారం సైదయ్య బృందం పర్యటించి పొలాలు, గుట్టలు, అడవుల్లో సీతాఫలాల చెట్లను పరిశీలించారు. చెట్ల పెరుగుదల, ఫలాల దిగుబడి గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోమాల శివారులో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీతాఫలాల ప్రాసెసింగ్ యూనిట్‌ను వారు పరిశీలించి, అధ్యయనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ సైదయ్య మాట్లాడుతూ చెన్నైలోని జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీలో దరఖాస్తు చేసేందుకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సేకరించామని, త్వరలోనే నివేదిక సమర్పిస్తామని తెలిపారు. దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటి జీఐ ట్యాగింగ్ ఉన్న ఫలంగా బాలానగర్ ఫలాలు కాబోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జియో ట్యాగింగ్ ప్రాక్టీషనర్ సుభాజిత్ సాహా, నాబార్డ్ ఏజీఎమ్ మహేందర్ రెడ్డి పోమాల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రైతుసంఘం ప్రతినిధులు గజేంద్రగౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, రాములు, అంజనేయులు, శైలేంద్రకుమార్, రమేష్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టేదీ?

- దేవరకద్ర నియోజకవర్గంలో జోరుగా దందా
- వాహనాలను పట్టించినా చర్యలు శూన్యం
- అధికారుల తీరుపై రైతులు, ప్రజల మండిపాటు

జానంపేట నుంచి రాత్రి వేళ ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

మూసాపేట, మే 6 : దేవరకద్ర నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నది. అక్రమ ఇసుక రవాణాపైఅధికారులకు రైతులు సమాచార విచ్చినా పట్టించుకోవడం లేదని, స్వయంగా వాహనాలను పట్టించినా ఫలితం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చీకటి పడిందంటే వాగులో జేసీబీలు, ట్రాక్టర్లతో ఇసుక మాఫియా హల్‌చల్ చేస్తున్నది. రాత్రికి రాత్రే వాగులను గుల్ల చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యల వాహనాలతో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. అక్రమార్కులు అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా, పేదలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కూడా సరిపడా ఇసుకను అందించడం లేదని వాపోతున్నారు.

తోడేస్తున్నారు..

దేవరకద్ర నియోజకవర్గకేంద్రం తోపాటు, కౌకుంట్ల, చిన్నచింతకుంట, మూసాపేట, అడ్డాకుల తదితర మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఆయా గ్రామాల్లో ఇసుక తరలిపోవడంతో వ్యవసాయ బోరు బావులు ఎండిపోయి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పూర్తి ఆధారాలతో వీడియోలు, చిత్రాలను చూయించినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్ రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కానీ కలెక్టర్ ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పోస్టాఫీస్‌లో బీపీఎం చేతివాటం

- సుకన్య సమృద్ధి యోజనలో రూ.లక్షలు స్వాహా?
- విచారణ చేపట్టిన అధికారులు
- ఖాతాదారుల ఆందోళన

మాగనూర్, మే 6 : మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో అవినీతి బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాగనూరు బీపీఎంగా పనిచేసిన ధనుంజయ ఖాతాదారులు పొదుపు చేసిన రూ.లక్షలు మాయం చేసినట్లు జనవరిలో వెలుగులోకి వచ్చింది. బీపీఎం నుంచి ఖాతాబుక్కులను జిల్లా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణ నత్తనడకన సాగుతుందని మంగళవారం మాగనూరు పోస్టాఫీస్‌కు విచారణకు వచ్చిన జిల్లా అధికారులు ప్రశాంతి, ఉమాకాంత్ ఎదుట ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. పోస్టాఫీస్‌లో మొత్తం 760 ఖాతాలు ఉండగా, ఎస్‌బీ ఖాతాలు 36, ఆర్‌డీ 552, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు 172గా ఉన్నాయి. సుకన్య సమృద్ధి యోజనలో 57ఖాతాల్లో లెక్కలు తేడాగా ఉన్నట్లు గుర్తించారు. బుక్కుల్లో మాత్రం స్టాంప్ వేసి జమ చేసినట్లు ఉండగా, అధికారికంగా జమకాలేదు. ఖాతాబుక్కులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి ఖాతాదారులు పొదుపు చేయడం లేదు. విచారణ పూర్తి చేసి పొదుపు వర్తింపజేయాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు సుకన్య సమృద్ధి యోజన పథకం యథావిధిగా కొనసాగుతుందని, 20రోజుల్లో విచారణ పూర్తి చేసి బీపీఎం స్వాహా చేసిన డబ్బులు ఖాతాల్లో జమ చేయిస్తామని హామీ ఇచ్చారు.

వనపర్తి మార్కెట్‌లోని ధాన్యం బస్తాలు

బోణీకాని బోనస్!

- వనపర్తి జిల్లాలో రైతులకు అందని రూ.17 కోట్లు
- 35 వేల సన్న వడ్లు కొన్నా చెల్లించని డబ్బులు
- కొనుగోళ్ల నగదు రూ.వందకోట్లు పెండింగ్
- దొడ్డు రకం వడ్ల కొనుగోలుపై అధికారుల మల్లగుల్లాలు
- ఎక్కడికక్కడ నిలిచిన కొనుగోళ్లు
- గాడితప్పుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియ

వనపర్తి జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 371 కేంద్రాలను ప్రారంభించారు. మరో వందకుపైగా సెంటర్లను తెరవాల్సి ఉన్నది. యాసంగిలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్న అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఉగాది పండుగ అనంతరం వరి కోతలు మొదలయ్యాయి. ముందుగా ఆత్మకూరు, అమరచింత, మదనాపురం, కొత్తకోట మండలాల్లో కోతలు షురూ కాగా.. ఇటీవల అన్ని ప్రాంతాల్లోనూ జోరందుకున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన అంచనా ఉన్నది. అయితే పది రోజులకు పైగా జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసి నష్టపోతామోనని దిగాలు చెందుతున్నారు.

సన్నవడ్లకు బోనస్ లేదు

నెల రోజులనుంచి జిల్లాలో వడ్ల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నది. ముందుగా కొనుగోలు చేసిన సన్నవడ్ల రైతులకు కూడా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు పడిన దాఖలాలు లేవు. క్వింటా సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పటి వరకు సన్న రకం వడ్లు దాదాపు 35 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసినట్లు అంచనా. వీటిలో ఒక్క క్వింటాకు కూడా బోనస్ డబ్బులు పడక పోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో రూ.17 కోట్ల బోనస్ రైతులకు అందాల్సి ఉంది. ఇప్పుడప్పుడంటూ ఊరించడమే తప్పా బోనస్ పడడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు చేసి నెల రోజులైనా బోనస్ బోణీ కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రూ.వంద కోట్ల బకాయిలు

సన్నవడ్ల బోనస్ ఇంకా బోనీ కాని పక్షంలో ఇక అసలు డబ్బులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. మొత్తం ఇప్పటి వరకు 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉంటే.. రూ86కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో పడ్డాయి. కొనుగోలు చేసిన మొత్తం వడ్లకు రూ.170 కోట్లకు పైగా రావాల్సి ఉంది. అయితే, ఇందులో సగం అటు.. ఇటు అన్నట్లుగానే రైతులకు డబ్బులు పడ్డాయి. ఈ లెక్కన ఇంకా రూ.వందకోట్లు రైతులకు అసలు డబ్బులే రావాలి. రోజు బ్యాంకుకు వెళ్లడం వెనుదిరగడం రైతుల వంతవుతుంది. ప్రారంభంలోనే ఇంతలా పరిస్థితి ఉంటే, ఇక చివరి వరకు కొనుగోళ్వవ్యవస్థ ఎలా సాగుతుందన్న విమర్శలు వెలువడుతున్నాయి.

నిలిచిన కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇందుకు కారణాలనేకం ఉన్నాయి. కొన్ని చోట్ల తాలుందని నిలిపివేస్తే.. మరి కొన్ని చోట్ల తూకం చేసిన ధాన్యం తరలించకపోవడంతో తూకాలు నిలిచిపోతున్నాయి. ఇంకొన్ని చోట్ల వెళ్లిన లారీలను మిల్లర్లు దించుకోకపోవడంతో ఆయా గ్రామాల్లో కొనుగోళ్లప్రక్రియ ముందుకు సాగడం లేదు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో 3 రోజులుగా కొనుగోళ్లు ప్రక్రియ నిలిచింది. ఇంకా మూడు రోజులు గడిస్తే తప్పా ఇక్కడ కొనుగోలు మొదలయ్యే పరిస్థితి లేదు. దీంతో ఎక్కడికక్కడే ధాన్యం మార్కెట్‌లో నిలిచిపోయింది. 4రోజుల కిందటి నుంచి దాదాపు 30వేల బస్తాల వరకు తూకం చేసిన ధాన్యం నిలిచిపోగా, ప్రస్తుతం ఇంకా 15వేల బస్తాలు మార్కెట్‌లో తూకం వేసినవే ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ గాడితప్పుతున్నది. ముందు నుంచి వరి దిగుబడులు అధికంగా ఉంటాయన్న అంచనా ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతున్నది. ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందక చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. యాసంగిలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసి 371 సెంటర్లు ప్రారంభించినా ఇప్పటి వరకు కేవలం 80 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరిగింది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఏ కేంద్రంలో చూసినా తూకాలు చేయక ధాన్యం రాసులే దర్శనమిస్తున్నాయి. రోజురోజుకూ ధాన్యం మరింత పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా సన్న వడ్లు 35 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినా క్వింటాకు కూడా బోనస్ డబ్బులు అందలేదు. జిల్లాలో రూ.17 కోట్ల బోనస్ అందాల్సి ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

- వనపర్తి, మే 6 (నమస్తే తెలంగాణ)

వనపర్తి మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన ధాన్యం

16రోజుల కిందట తూకాలు చేసిన రైతుల ధాన్యం మార్కెట్‌లో తరలించకుండా ఇంకా నిలిచి ఉండంటే ట్రాన్స్‌పోర్టు పరిస్థితి అర్థమవుతుంది. వీటిని తరలించిన అనంతరం మళ్లీ తూకాలు చేస్తామని అధికారులు చెబుతుండడంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇలా ఈ ఒక్క సెంటరే కాదు.. అనేక కేంద్రాల్లో రకరకాల సమస్యలతో కొనుగోళ్లప్రక్రియ సాఫీగా సాగడం లేదు.

తూకం వేసి 16 రోజులైనా..

నా వడ్లు తూకం వేసి 16 రోజులైంది. 380 సంచులు తూకం వేస్తే.. ఇప్పటి వరకు తరలించడం లేదు. నెల రోజులుగా మార్కెట్ సెంటరులోనే మగ్గుతున్నా.. ఇంకా ఎన్ని రోజులు అవుతుందో అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షం వస్తే .. ఒక్క కవరు కూడా ఇవ్వడం లేదు. అడిగి అడిగి వేసారి పోతున్నాం. రైతులను నిట్టనిలువు నా ముంచుతున్నరు. సెంటర్లలో ఒక్క సమస్య కాదు.. ఎన్ని సమస్యలున్నయో.. మాకు దేవుడు కనిపిస్తున్నడు. ఇంత ఘోరంగా పరిస్థితి ఎప్పుడు లేదు. పంట పండించిన సుఖం లేదు.

- రాజు, రైతు, చిట్యాల, వనపర్తి మండలం

రెండువారాలుగా ఎదురుచూపులు

ఇప్పటికే రెండుసార్లు రావాల్సి రైతు బంధు డబ్బులు తమ ఖాతాలో పడలేదు. క్వింటాకు రూ. 500బోనస్ రైతులకు అదనంగా వస్తాయని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 46 క్వింటాళ్ల సన్నరకం వడ్లను విక్రయించాం. రెండు వారాలుగా రూ.23 వేల బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న. వారంలో ఇస్తామన్న ధాన్యం డబ్బులు కూడా సకలంలో రావడం లేదు. ప్రభుత్వం చెప్పినట్లు పంటడబ్బులతోపాటు బోనస్ వెంటనే ఇవ్వాలి. అలా చేస్తే రైతుల అవసరాలకు ఉపయోగపడతాయి. ఇప్పటి వరకు 46 క్వింటాళ్ల బోనస్ డబ్బులే రాకుంటే.. ఇంకా దాదాపు 180 క్వింటాళ్ల ధాన్యం ఉందని, పంటను ఎక్కడ విక్రయించాలనే ఆలోచనలో ఉన్నాం.

- గొల్ల రాంచంద్రయ్య, రైతు, అమరచింత

అవసరానికి రాని బోనస్ డబ్బులు

ఈ ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ ఉత్తవే అబ్బా.. అప్పుడు ఓట్లు వేసేటప్పుడు ఎన్నిమాటలు చెప్పిరి.. అన్ని ఉత్తవే.. బోనస్ డబ్బులు కూడా వచ్చేదాకా మాకు నమ్మకం లేదు. వారం అయిపాయే 33 క్వింటాళ్ల సన్న వండ్లు మహిళా సంఘం వాళ్లకు అమ్మినం. ఇప్పటి వరకైతే వాళ్లు చెప్పినట్టుగా పంట డబ్బులే రాలే. ఇంకా బోనస్ డబ్బులు రూ.16500 వస్తే దేని కైనా అవసరం వస్తాయని అనుకుంటే ఇదికూడా ఉత్తమాటలాగనే ఉంది. మాకు మూడు ఎకరాల భూమి ఉంది. అందులో వరి పంటయేస్తే కాలం కలిసిరాక అంతా తాలు పాయే. వచ్చిన పంటలో ఇంత తిన డానికి పెట్టుకుని 33క్వింటాళ్ల సన్నవడ్లను ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి మహిళా సంఘం వాళ్లు మా ఊరిలో పెట్టిన కొనుగోలు కేంద్రంలో అమ్మినం. డబ్బుల కోసం ఎప్పుడు పడుతాయని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంకా సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న బోనస్ పైసలు ఎప్పుడు వస్తాయో ఏమో.

- మంగ్యానాయిక్, చంద్రప్పతండా, అమరచింత

తేమశాతం పేరుతో టెండర్లకు నిరాకరణ

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ గేటుకు తాళం వేసి ఆందోళనకు దిగిన రైతులు

జడ్చర్ల, మే 6 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో కొంతమంది ధాన్యానికి వ్యాపారులు టెండర్లు వేయకుండా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. మార్కెట్‌కు అన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తులు 10,205 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చాయి. హంస, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం 5,600 క్వింటాళ్లు ఉన్నాయి. కొంత మంది రైతులకు సంబంధించిన ధాన్యం తేమ శాతం, గింజ నాణ్యత లేదంటూ వ్యాపారులు టెండర్లు వేయలేదు. దీంతో రైతులు మార్కెట్ గేట్‌మూసి ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే టెండర్లు వేయరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు వేసిన వాటికి కూడా మద్దతు ధర ఇవ్వడం లేదని మండిపడ్డారు. క్వింటాకు రూ. 1,500 నుంచి రూ.1,700ల ధర మాత్రమే ఇస్తున్నారని, తేమ శాతం పేరుతో ధరలు తగ్గించి మాపొట్ట కొడుతున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలామణి, మార్కెట్ కార్యదర్శి నవీన్, ఎస్సై మల్లేశ్, డీటీ మార్కెట్‌యార్డుకు చేరుకొని రైతులతో మాట్లాడి టెండర్లు వేయిస్తామని సముదాయించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడి టెండర్లు వేయించారు. దాంతో గొడవ సద్దుమణిగింది. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొస్తే మంచి ధరలు వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు.

తూకాల్లో వ్యత్యాసం

- మూడు వే బ్రిడ్జీల్లో వేర్వేరుగా నమోదు
- ఆందోళన చేపట్టిన రైతులు

వనపర్తి టౌన్, మే 6 : మండలంలోని సల్కలాపుల్‌కు చెందిన ఊషన్న ధాన్యాన్ని బియ్యం పట్టించేందుకు మిల్లుకు తరలించే ముందు మండలంలోని మూడు వే బ్రిడ్జీల్లో తూకం వేయించాడు. మూడింట్లో వేర్వేరుగా తూకం రావడంతో అవాక్కయ్యాడు. ఒక దాంట్లో 9,910 కేజీలు, మరో వే బ్రిడ్జిలో 9,640 కేజీలు, ఇంకో వే బ్రిడ్జిలో 9,730 కేజీల తూకం వచ్చింది. దీంతో ఊషన్న ఒక్కో వే బ్రిడ్జిలో ఒక్కో తూకం రావడం ఏమిటని వే బ్రిడ్జి యజమానులను నిలదీశారు. విషయం తెలుసుకున్న ఇంకొంత మంది రైతులు వే బ్రిడ్జి యజమానులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్‌లో తెచ్చిన ధాన్యం వే బ్రిడ్జి వద్ద కాంటా చేస్తున్న దృశ్యం

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు

జడ్చర్ల టౌన్, మే 6 : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి ఆశ కార్యకర్తలు మంగళవారం జడ్చర్లలోని కావేరమ్మపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్యకు సమ్మె నోటీసు అందజేశారు. కేంద్రం కొత్త చట్టాలను అమల్లోకి తీసుకొస్తే కార్మికులకు 8గంటల పనిదినానికి బదులుగా 12గంటలు కానున్నదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చేపడుతున్న సమ్మెకు కార్మికులు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుగుణ, సునీత, పద్మ, మయూరి, లక్ష్మి, మంగ, జయలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

అప్రతిష్టపాలు

- అలంపూర్ ఆలయాల అవినీతిపై అధికారుల అలసత్వం
- 6 నెలలుగా విచారణకే పరిమితం

అలంపూర్, మే 6 : దేశంలోనే ఎంతో ప్రఖ్యాతిగాంచిన అలంపూర్ క్షేత్రాన్ని సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నది. కొంతకాలంగా ఆలయంలో అవినీతి, అక్రమాలపై సంబంధిత శాఖ అధికారులు పలుపర్యాయాలు విచారణ చేపట్టారు. ఈ విషయమై అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చట్టసభల్లో కూడా ప్రస్తావించారు. ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరినా ఫలితం లేకుండా పోయింది.

కేసీఆర్ హయాంలో ప్రాధాన్యం..

రాష్ట్రంలో ఏకైకశక్తి పీఠమైన అలంపురం క్షేత్రంలో వెలిసిన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎంతో ప్రాధాన్యమిచ్చారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడ్డారు.

అక్రమాలపై పట్టించుకోని ప్రభుత్వం..

ఆలయ నిర్వాహకులు దాతలు ఇచ్చిన విరాళాలు, వస్తువులను ఖర్చు చేసినట్టు దొంగలెక్కలు రాసి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు జోరందుకున్నాయి. రశీదులు వచ్చిన విరాళాలకే దిక్కు లేకుండా పోయింది. ఇక రశీదులు లేని విరాళాలు ఎన్ని స్వాహా చేశారోనే అనుమానాలు ఉన్నాయి. అంతేకాకుండా అన్నసత్రానికి సంబంధించి యేటా సుమారు రూ.4కోట్ల టర్నోవర్‌కు సంబంధించి సరైన లెక్కలు లేవని తెలుస్తున్నది.

అక్రమార్కులపై చర్యలేవీ?

ఆలయంలో ఉన్నత స్థాయి అధికారి, ఆలయ ముఖ్య అర్చకుడు కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని లోకం కోడై కూసింది. ఆరు నెలల నుంచి అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. అక్రమార్కులు ఎవరి పరిధిలో వారు చక్రం తిప్పుకుంటూ ఈ వ్యవహారం నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అర్చకుడిపై సస్పెన్షన్ వేటుపడినా ఫిర్యాదుకు సంబంధించి సరైన ఆధారాలు సమర్పించలేదని జూన్ 26వ తేదీ వరకు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆశించింది. ఆలయంలో ఇద్దరిపై ఆరోపణలు వస్తే ఒకరిపైనే చర్యలు తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 1,400 ఏండ్ల చరిత్ర కలిగిన అలంపురం క్షేత్రం పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈతకు వెళ్లి మృతి చెందిన బాలుడు

ఈతకు వెళ్లి బాలుడి మృతి

దేవరకద్ర, మే 6 : ఈత నేర్చుకోవడానికి వెళ్లి ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. భూత్పూర్ మండలంలోని అన్నసాగర్‌కు చెందిన పద్మ, వెంకటేశ్ కుమారుడు సన్నీ(12) వేసవి సెలవులు ఉండడంతో బంధువుల గ్రామమైన వెంకటాయపల్లికి రెండు రోజుల కిందట వచ్చాడు. ఈత నేర్చుకునేందుకు బంధువు శ్రీనుతో కలిసి దేవరకద్ర సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. నీళ్లు మింగి ఊపిరాడక మునిగిపోవడంతో గుర్తించిన వారు స్విమ్మింగ్ పూల్ నుంచి బయటికి తీశారు. వెంటనే 108 ద్వారా దవాఖానకు తరలించేలోపే మృతిచెందాడు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

మృతి చెందిన నాగయ్య (ఫైల్)

కోడేరు, మే 6 : వడదెబ్బ లక్షణాలతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని నర్సాయిపల్లిలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాయపల్లి గ్రామానికి చెందిన ఎర్ర మోని నాగయ్య(55) శనివారం గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా ఎండ వేడికి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు కొల్లాపూర్ దవాఖానకు తరలించగా అక్కడ పరిపస్థితి విషమంగా ఉండడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి రెఫర్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

హడలెత్తిస్తున్న హైనా

నవాబ్‌పేట, మే 6 : మండలంలోని వివిధ గ్రామాల్లో హైనా వారం రోజుల నుంచి హడలెత్తిస్తోంది. ఐదు రోజుల కిందట తిమ్మయ్యపల్లికి చెందిన రైతు పశువుపై దాడి చేసి హతమార్చింది. ఆదివారం అర్ధరాత్రి యన్మన్‌గండ్లకు చెందిన బ్యాగరి శ్రీనివాసులు అనే రైతు పశువుల మందపై దాడి చేసి లేగదూడను చంపేసింది. తాజాగా కామారానికి చెందిన రాంకొండ అనే రైతు పశువుపై సోమవారం అర్ధరాత్రి దాడి చేసింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంకటేశ్, బీట్ ఆఫీసర్ రమేశ్ కామారం శివారులోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు.